

లబ్ధిదారులకు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

## సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సర్కారు

**ఎమ్మెల్సీ కడియం శ్రీహరి**

హనుమకొండ, జూన్ 19 : దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ సర్కారు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. సోమవారం కనకదుర్గ కాలనీలోని ఆయన నివాసంలో స్టేషన్ ఘన్‌పుర్ నియోజకవర్గం పరిధిలోని వేలేరు, ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పుర్, చిల్పూర్, జఫర్‌గఢ్, రఘునాథపల్లి, లింగాలఘనపురం మండలాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు రూ.5.69లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ప్రజల నుంచి ఒత్తిడి చేస్తున్నారన్నారు. నిస్సహాయులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందన్నారు. లక్ష కోట్ల రూపాయలను సంక్షేమ పథకాలకు ఖర్చు పెడుతున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. మానవీయ కోణంలో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అందరూ మద్దతు తెలుపాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

## తాగునీటి సరఫరా సక్రమంగా చేపట్టాలి

**మేయర్ గుండు సుధారాణి**

వరంగల్, జూన్19 : గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. సమర్థవంతంగా తాగునీటి సరఫరా జరిగేందుకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడతూ లీకేజీలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టాలన్నారు. నగరంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. తక్కువ ప్రెషర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిని పరిష్కరించాలన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటనను బల్దియా అధికారులు సమర్థవంతంగా పనిచేసి విజయవంతం చేశారని అభినందించారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, ఈఈలు శ్రీనివాస్, డీఈలు రవికిరణ్, సారంగం, ఏఈలు పాల్గొన్నారు.



12 మోరీల నాలాను పరిశీలిస్తున్న కమిషనర్

## సమీకృత మార్కెట్ పనుల్లో వేగం పెంచాలి

**గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా**

వరంగల్,జూన్ 19 : సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నక్కలగుట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో రూ.3.4 కోట్ల నిధులు అవసరమని అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం హంటర్ రోడ్డులోని 12 మోరీల నాలాలను కమిషనర్ పరిశీలించారు. కరీమాబాద్ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చే 12 మోరీల నాలా పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ కృష్ణారావు, ఈఈ రాజయ్య, డీఈలు సంతోష్‌బాబు, రవికుమార్, ఏఈ హరికుమార్ పాల్గొన్నారు.

# అన్ని మతాలను గౌరవిస్తున్న కేసీఆర్

- ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి
- పండుగలను సంతోషంగా జరుపుకునేందుకు కానుకలు
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- రూ.1.50 కోట్లతో గురుద్వార్‌లో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



గురుద్వార్‌లో కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19 : దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని మతాలను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ 6వ డివిజన్‌లోని సిక్కుల దేవాలయం గురుద్వార్‌లో కమ్యూనిటీహాల్ భవనానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చీఫ్ విప్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలనే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అనేక దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, గురుద్వార్లు, చర్చిల్లో ప్రజల క్షేమం కోసం పూజలు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో పాటు అన్ని మతాల ఔన్నత్యాన్ని ప్రజలు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో అన్ని పండులను జరుపుకునేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా అధికారికంగా కానుకలు ఇస్తున్నట్లు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పేదలకు దుస్తుల పంపిణీ, రంజాన్‌కు ఇఫ్తార్ విందులు, కానుకల పంపిణీ, బతుకమ్మ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీతోపాటు గురునానక్ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించడం, బోనాలు పండుగను అధికారికంగా నిర్వహించడం వంటివి చేస్తున్నారన్నారు. చారిత్రక నగరంలోని గురుద్వార్‌లో కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్పొరేటర్ చెన్నం మధు మాట్లాడుతూ గురుద్వార్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలోనే మొదటిసారి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ రూ.1.50కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా చీఫ్‌విప్ గురుద్వార్‌కు వచ్చి, ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం కమ్యూనిటీ హాల్ పనులకు భూమి పూజ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌కు గురుద్వార్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, గుంటి రజితా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, సుగుణాకర్, గురుద్వార్ అధ్యక్షుడు మహేందర్‌సింగ్, ఓంకార్‌సింగ్, అవతార్‌సింగ్, చైత్రపాల్ సింగ్, 6వ డివిజన్ గౌరవ అధ్యక్షుడు రెడ్డి రాజేశ్వర్, డివిజన్ అధ్యక్షుడు మడిపల్లి సుమన్‌గౌడ్, రాజేందర్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బజ్జూరి అజయ్‌కుమార్, వెన్ను కొండయ్య, ఎజాజ్, కిశోర్, బాబన్న, పవన్, రాము, కృష్ణ, రాజు, మహిళా మండలి ఆర్పీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గెస్ట్ అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ సిటీ, జూన్19 : ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యాకళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ హై తెలిపారు. ఫిలాసఫీ, సోషియాలజీ, సైకాలజీ, పెడగాగి సైన్స్, పెడగాగి ఫిజికల్ సైన్స్, పెడిగాగి మ్యాథ్స్, ఇంగ్లిష్, తెలుగు, సోషల్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో అభ్యర్థులు పీజీ, ఎంఈడీ చేసి ఉండాలని సూచించారు. ఆసక్తిగల వారు 30 వరకు లష్కర్‌బజార్‌లోని కళాశాలలో దరఖాస్తు చేయాలని తెలిపారు.

## రేపు డీఈఈ సెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

హనుమకొండ సిటీ, జూన్19 : డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణత సాధించి, మొదటి సంవత్సరంలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో ప్రవేశాలు పొందాలనుకునే వారు బుధవారం ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని డైట్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాంకుకార్డు, హాల్‌టికెట్, ఎస్సెస్సీ, ఇంటర్, 4 నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయం, కులం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

## పద్మాక్షి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు ప్రారంభం



కూరగాయల అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

హనుమకొండ, జూన్ 19: హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శాకంబరి ఉత్సవాలు సోమవారం ప్రారంభమైనట్లు అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ తెలిపారు. వారాహి దేవికి సహస్ర నామాలతో అర్చనలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పద్మాక్షి అమ్మవారికి కూరగాయల మాలను వేసినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్లు వివరించారు.

# మొక్కలను నాటి, కాపాడాలి

- జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్
- ఘనంగా హరితోత్సవం

నయీంనగర్, జూన్19 : మొక్కలను పెంచడమే కాకుండా వాటిని కాపాడాలని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రేటర్ 58వ డివిజన్‌లోని ముస్లిం ఈద్గా దగ్గర సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయ్‌భాస్కర్ హాజరై మొక్కనాటి, మాట్లాడారు. నాటిన ప్రతి మొక్క బతికినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్మడి లోహితా రాజు, ఫౌండేషన్ చైర్మన్ అన్వర్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఫయాజ్, ఖదీర్, యూసఫ్, మజార్, మున్నీర్, చిన్న పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..**

హనుమకొండ సిటీ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన హరితోత్సవంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖధికారి ఏ గోపాల్ పాల్గొని మొక్కను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ఏవో హరిలాల్ పాల్గొన్నారు.

**ఏవీవీ కాలేజీలో..**

వరంగల్ : హరితోత్సవంలో భాగంగా ఏవీవీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరు రెండు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఏవీవీ విద్యా సంస్థల శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్, విశ్రాంత హెచ్ఎం వాసుదేవులు, ప్రిన్సిపాల్ భుజేందర్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ అనిత, గోపి, సంజీవ, నవీన్, వీరేశలింగం, భాస్కర్, వలంటీర్లు పాల్గొన్నారు.



నయీంనగర్ : మొక్కను నాటుతున్న దాస్యం విజయ్‌భాస్కర్



హనుమకొండ సిటీ : మొక్క నాటుతున్న డీఐవో గోపాల్, పిన్సిపాల్ ధర్మేంద్ర



గులాబీ, మల్లె పూల అలంకరణలో సిద్ధేశ్వరుడు

## సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

హనుమకొండ, జూన్ 19 : ఆషాఢ మాసం పాఢ్యమి తిథి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని హనుమకొండ పద్మాక్షి కాలనీలోని సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, గులాబీ, మల్లె పూలతో ప్రత్యేకంగా అలంకరించినట్లు పేర్కొన్నారు.